🌐 : www.aknu.edu.in
M : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
© : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 50 | 27-09-2021 | పుటలు : 4


## కోవిడ్ పరిస్థితుల్లో 100 వెబినార్లతో


# నన్నయ టాప్


- తెలుగు రాష్ట్రాలలో అత్యధిక వెబినార్స్ నిర్వహించిన నన్నయ వర్సిటీ
- వీసీ జగన్నాథరావుకు ప్రశంసలు



100 వెబినార్ల పోస్టర్ ను ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

**22.09.21 (మీడియాసెల్)** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే అత్యధిక జాతీయ, అంతర్జాతీయ వెబినార్లను నిర్వహించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రథమ స్థానంలో నిలిచిందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం 100 వెబినార్ల పోస్టర్ ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోవిడ్ 19 ప్రపంచాన్ని సంక్షోభంలోనికి నెట్టేసిందని అన్ని రంగాలు కుదేలయ్యాయని అన్నారు. ఈ పరిస్థితులు విద్యా వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభవాన్ని చూపించాయని చెప్పారు. కోవిడ్ 19, లాక్ డౌన్ వంటి క్లిష్టమైన సమయంలో విద్యా విజ్ఞాన వికాసానికి వినూత్న విధానాలు ఆలోచించాలని వెబినార్ల నిర్వహణకు సంసిద్ధమయ్యామని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ప్రపంచ నలుమూలల నుండి ఆయా రంగాలలో నిష్ణాతులైన వారి ఉపన్యాసాలు నన్నయ కుటుంబానికి అందించి వారిని విద్యా ప్రగతివైపు, పరిశోధనలవైపు నడపాలన్న లక్ష్యంతో వీటిని ప్రారంభించామని అన్నారు. ఉభయగోదావరి జిల్లాలకు విద్యా కేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి అన్ని విభాగాల వారు వెబినార్లు నిర్వహించాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కు, విభాగాధ్యాపకులకు ఆదేశాలు అందించామని చెప్పారు. రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు అనే తారతమ్యం లేకుండా అందరూ తమతమ రంగాలలో వెబినార్లు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తూ అందరిని ప్రోత్సహించామని తెలిపారు. దీనిని అధ్యాపకులు అందరూ సద్వినియోగం చేసుకొని తమతమ విభాగాల నుండి వెబినార్లు నిర్వహించేందుకు ముందుకు వచ్చి విజ్ఞాన వికాసంలో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. 2020 మే నెల నుండి 2021 సెప్టెంబర్ నెల వరకు 100 జాతీయ, అంతర్జాతీయ వెబినార్లు నిర్వహించామని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అత్యధిక వెబినార్లు నిర్వహించినట్లు ప్రథమ స్థానంలో నన్నయ విశ్వ విద్యాలయం నిలిచిందన్నారు. ఈ వెబినార్లలో ఎందరో ప్రముఖులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు దేశ విదేశాల నుండి ఉపన్యసించి స్ఫూర్తిని నింపారని చెప్పారు. వేలాది మంది విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు ఇందులో పాల్గొని ఈ-సర్టిఫికెట్లను అందుకున్నారని తెలిపారు. దీనికి సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు, సాంకేతిక సిబ్బందికి వీసీ అభినందనలు తెలిపారు. వీసీ జగన్నాథరావు ప్రోత్సాహంతో అన్ని విభాగాలు ముందుకు వచ్చి 100 వెబినార్లు నిర్వహించి తెలుగు రాష్ట్రాలలోనే ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకోవాడానికి కారణం అయిందని అధికారులు వీసీని ప్రసంసించారు. అత్యధిక వెబినార్ల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ప్రశంసలను గుర్తుచేస్తూ వీసీని అభినందించారు. ఈ కార్యక్రమంలో వెబినార్లకు సాంకేతిక సహకారం అందించిన వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాసరావు, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, కాకినాడ క్యాంపస్ ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి, ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, డీన్స్ డా.పి.వెంకటేశ్వరరావు, డా.పి.విజయనిర్మల, డా.ఎన్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## ఉపకులపతి ఉవాచ

### అభినందన! కృతజ్ఞత!!



కోవిడ్ సంక్షోభంలో ఏర్పడిన విద్యారంగం స్తబ్ధతను ఛేదిస్తూ లాక్ డౌన్ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ అధ్యాపక వర్గమంతా ఆన్లైన్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ... అధ్యాపక బోధనాభివృద్ధి కార్యక్రమాలు (FDP), సదస్సులు, కార్యశాలలు, చర్చావేదికలు, కోవిడ్ అవగాహన - జాగ్రత్తలు, కౌన్సిలింగ్ కార్యక్రమాలతో, పరిశోధన పత్రాల సమర్పణలతో 100 వెబినార్స్ నిర్వహించటం విశేషమైన విషయం. ఇదొక యజ్ఞంగా స్వీకరించి కృషి చేసిన అందరికీ, అన్ని విభాగాల వారికి అభినందనలు అందిస్తున్నాను. దీనివలన అధ్యాపకులలకు, విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని భావిస్తున్నాను. ఇదే స్ఫూర్తితో మీ అందరి కృషి, సహకారాలతో త్వరలోనే విశ్వవిద్యాలయానికి మనం NAAC గ్రేడింగ్‌ను సమకూర్చుకుంటామని భావిస్తున్నాను. పిల్లకాలువలా మొదలై పరవళ్లు తొక్కుతూ గంభీరమైన గోదావరిలా ప్రవహిస్తూ "నన్నయవాణి" విశ్వవిద్యాలయ పత్రిక 50 సంచికల వార్షికోత్సవ వేళకి 100 సదస్సులు పూర్తి చేసుకోవడం మరింత ఆనందాన్నిస్తోంది. ఆటంకాలను అధిగమించుకుంటూ గోదావరి జిల్లాల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటైన నన్నయ విశ్వవిద్యాలయ సమగ్రాభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరుతున్నాను. అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మొక్కా జగన్నాథరావు

## మంచి మాట

మన ఆంతర్యాన్ని బట్టే ఆలోచనలు ఉంటాయి.ఆలోచనలను అనుసరించే ఆచరణ ఉంటుంది.

- గోథే







## వీసీ ప్రోత్సాహంతో 100 వెబినార్స్



విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో 100 వెబినార్స్ నిర్వహించాం. క్యాంపస్‌లోని అన్ని విభాగాలు జాతీయ,అంతర్జాతీయ వెబినార్స్ నిర్వహించాయి. జూమ్, గూగుల్ మీట్, మైక్రోసాఫ్ట్ థీమ్స్ , వెబెక్స్ వంటి ఆన్లైన్ టూల్స్‌ని ఈ వెబినార్స్‌కు ఉపయోగించాం. వెబినార్స్ నిర్వహణలో ఆన్లైన్ ఈవెంట్ రిజిస్ట్రేషన్ నుండి హాజరైన వారికి ఈ - సర్టిఫికెట్ అందించే వరకూ నాకు సాంకేతిక సహకారాన్ని అందిచిన వెబ్ అసిస్టెంట్ ఎం.రాఘవులు, నెట్ వర్క్ అసిస్టెంట్ వి.వి.రాఘవులు, ల్యాబ్ అసిస్టెంట్స్ సునీల్, నగేష్ లకు ధన్యవాదాలు. భవిష్యత్తులో వీసీ మరియు అధికారుల ప్రోత్సాహంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

**– మంచెం శ్రీనివాస్, వెబ్ మాస్టర్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.**

# సంపాదకీయం



## విద్యార్థులారా!

ఒక పుస్తకాన్ని పట్టుకొని చదవటమంటే ఒక మహా రచయితతో మనం సంభాషించినట్లు. మనిషి జీవితం సహజంగా మహిమాన్వితమైంది. పుస్తక జ్ఞానం వలన మనిషికి ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. మనిషి జీవితం కురుక్షేత్రంలాంటిది. పుస్తక జ్ఞాన సముపార్జనతో అతడు దానిని ధర్మక్షేత్రంగా మార్చుకుంటాడు. గ్రంథాలయాలు మనిషిని జ్ఞానిగా, కర్మ వీరునిగా త్రిగుణాతీతమైన వ్యక్తిగా, జితేంద్రియునిగా, మహనీయునిగా తీర్చిదిద్దుతాయి. మనిషి మనీషి (బుద్ధిమంతుడు) అవుతాడు. సామాన్యుడు మాన్యుడవుతాడు. మహాత్ముడవుతాడు. ధీరోదాత్తుడై సమాజ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాడు.

' మొదటిసారి మంచి పుస్తకాన్ని చదివినప్పుడు కొత్త స్నేహితుని సంపాదించుకున్న వానివలె, రెండవ సారి చదివినప్పుడు పాత స్నేహితుని కలుసుకున్నట్లు ఆనందం కలిగింద'న్నారు గ్లాడ్ స్టన్ అనే పండితుడు. గ్రంథాలయంలో అడుగు పెట్టటమంటే మహనీయులతో, మహా రచయితలతో, జ్ఞాన సంపన్నులతో చెలిమి చేయటమే. సమూహంలో ఉంటూనే ఏకాంతాన్ని అనుభవించగలిగే అతి సుందర ప్రదేశం గ్రంథాలయం. అక్కడ తవ్వుకోగలిగినన్ని జ్ఞాన గనులు. అక్కడే కూర్చుని ప్రపంచాన్ని చుట్టి రాగలిగినన్ని వాహనాలు. గ్రంథాలయమంటే పుస్తకాల కూర్పు. ఒక పద్ధతిగా అమర్చిన పేర్పు. ఎన్నో ఉద్యమాలకు, రచనలకు, ఉపన్యాసాలకు చేర్పు.

మనిషి కాగితం కనుగొన్న తర్వాత ప్రపంచం రాతే మారిపోయింది. తాను తెలుసుకున్నదీ, అనుభవించిందీ, ఆలోచించిందీ ఇతరులతో పంచుకోవాలనే తపనే భాష, లిపి పుట్టుక, కాగితం తయారీకి కారణమైంది. రాసిన వాటినన్నింటినీ ఒకచోట ఉంచి అందరికీ అందుబాటులోకి తీసుకుని రావాలనే ప్రాథమిక భావనే గ్రంథాలయాలు ఏర్పడటానికి మూలమైంది. కళలు, నిర్మాణం, సాహిత్యం, విజ్ఞానం, ధార్మిక విషయాలలో ఒకరినొకరు ప్రభావితం చేసుకునే వీలుకలిగింది.

మన జాతీయ గ్రంథాలయం (నేషనల్ లైబ్రరీ) కోల్కతాలో ఉంది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుంది. 30 ఎకరాల విస్తీర్ణంలో, వివిధ భాషల్లోని 22 లక్షల పుస్తకాలు అక్కడ ఉన్నాయి. భారత ముద్రణా వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకోసం కాపాడటం ఈ గ్రంథాలయం ప్రాథమిక లక్ష్యం. ఇంక రాష్ట్ర గ్రంథాలయం, జిల్లా గ్రంథాలయం, శాఖా గ్రంథాలయాలు దేశమంతా విస్తరించి ఉన్నాయి. తెలుగునాట గ్రంథాలయోద్యమం ద్వారా కృషి చేసిన మహనీయుడు అయ్యంకి వెంకట రమణయ్య గారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు విద్యార్థులకు కావలసిన పుస్తకాలను అందిస్తూనే ఉంటాయి. ఖరీదైన పుస్తకాల్ని కావలసినవన్నీ వ్యక్తిగతంగా అందరూ సమకూర్చుకోలేకపోవచ్చు. ఆ కొరత తీర్చే వ్యవస్థే గ్రంథాలయం. కాబట్టి విద్యార్థులు తీరిక దొరికేసరికి మొబైల్ వినోదాన్ని కాసేపు పక్కన పెడితే గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, పరిశీలన పరిశోధన గ్రంథాలు పరిచయమవుతాయి. 'గ్రంథాలయ అరల్లో నిధులు నిద్రిస్తున్నాయి, ముట్టుకుని చూడు తళుక్కున మెరుస్తాయి' అంటారు ఆచార్య ఎన్.గోపి.

విద్యార్థులారా! అపారమైన జ్ఞానాన్ని మీకు పంచి పెట్టదానికి రచయితలు ఎందరో ఎదురుచూస్తున్నారు. వెళ్ళండి. ఒకసారి గ్రంథాలయంలో కలియతిరగండి. పుస్తకాల్ని ముట్టుకోండి. అపారమైన వెలుగేదో మీ కళ్ళల్లో తళుక్కుమంటుంది. పుస్తకాలు కాలసాగర తీరాన దారిచూపే లైట్ హౌస్లు. పుస్తకాలు హస్తగత సుందరోద్యాన వనాలు. పుస్తకాలు అనర్ఘ కోశాగారాలు! పుస్తకాలు ఆత్మకి ఔషధాలు!!




సెప్టెంబర్ 27న భారత్ బంద్ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆ రోజు జరగవలసిన ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లమో పరీక్షలను వాయిదా వేస్తూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి ప్రకటన విడుదల చేసారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**24.09.21 (మీడియాసెల్)** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్స్ సెల్, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ మరియు సైబర్ పీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో "డేటా ప్రైవసీ అండ్ సోషల్ మీడియా సేఫ్టీ" అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో అధ్యాపకులు, విద్యార్థులు వీక్షించేందుకు వెబినార్ లైవ్ ను అందించారు. ఈ వెబినార్ కు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మహిళలు సైబర్ నేరాల సమస్యలతో అధికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యువత టెక్నాలజీని చాలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా సాధనాల ద్వారా బహిర్గతం చేయడంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. నేటి ఆధునిక యుగంలో డేటా భద్రతపై అవగాహన పెంచు కోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. మేధావులైన యువతరం తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ ప్రయోజనార్థం ఉపయోగించాలని తెలియజేశారు. సైబర్ నేరగాళ్ళకు భయపడాల్సిన పని లేదని ధైర్యంగా ఉంటే ఎటువంటి సమస్యనైన ఎదుర్కోవచ్చునని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయ పరిధిలో అన్ని అనుబంధ కళాశాలల్లో ఇంటర్నెల్ కంప్లైంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులంతా దిశా యాప్ ను ఇన్.స్టాల్ చేసుకోవాలని తెలియజేశారు. మహిళలు వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా కలిగే అనర్థాలను యువతరం గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూనివర్సిటీ తరపున చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా. కె.నూకరత్నం ను అభినందించారు. డేటా ప్రైవసీ, సోషల్ మీడియా సేఫ్టీ మరియు సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి సంబంధించిన పూర్తి వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రముఖ సైబర్ లాయర్ జనిస్ వెర్గీస్ వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా. కె.నూకరత్నం, సైబర్ పీస్ ఫౌండేషన్ ఐ.ఎల్.నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఈడీ పరీక్ష ఫలితాలు విడుదల చేసిన వీసీ

**25.09.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బీఈడీ, బీపిఈడీ, డిపిఈడీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు విడుదలచేసి వివరాలను తెలియజేశారు. ఉభయగోదావరి జిల్లాల్లోని మూడవ సెమిస్టర్ బీఈడీ పరీక్షలు 1833 మంది వ్రాశారని వారిలో 1603 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, ఉత్తీర్ణతా శాతం 87.45 గా ఉందని తెలిపారు. బీపిఈడీ పరీక్షలు 194 మంది వ్రాశారని వారిలో 171 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, ఉత్తీర్ణతా శాతం 88.14గా ఉందన్నారు. డీపిఈడీ పరీక్షలు 131 మంది వ్రాసారని వారిలో 116 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, ఉత్తీర్ణతా శాతం 88.55 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునన్నారు. కొవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, అసిస్టెంట్ డీన్ డా.డి.కళ్యాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్. లింగారెడ్డిని వీసీ అభినందించారు.

# విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంచాలి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



ఇంజనీరింగ్ క్లబ్స్ సభ్యులతో వీసీ జగన్నాథరావు

**21.09.21 (మీడియాసెల్)** విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీసే విధంగా అధ్యాపకులు మార్గనిర్దేశం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. మంగళవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు మరియు ఇంజనీరింగ్ క్లబ్స్ మెంబర్స్ తో వీసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీసే విధంగా అధ్యాపకులు మార్గనిర్దేశం చేయాలని, ఇంజనీరింగ్ క్లబ్స్ ఆధ్వర్యంలో సృజనాత్మక ప్రయోగాలు సమాజానికి అందించాలని అన్నారు. విద్యార్థుల మేధస్సును పెంపొందించే విధంగా క్లబ్ కార్యక్రమాలు ఉండాలన్నారు. జాతీయ స్థాయి ఇంజనీరింగ్ క్లబ్స్ తో అనుసంధానమై వివిధ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు నూతన విషయాలు తెలుస్తాయన్నారు. ఐఐటి, ఎన్.ఐ.టి. విద్యార్థుల మాదిరిగా ప్రొఫెషనల్ బాడీస్ లోని స్టూడెంట్ చాప్టర్స్ మన ఇంజనీరింగ్ క్లబ్స్ వారు సభ్యులుగా ఉండాలని సూచించారు. తద్వారా జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ కు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడం మరియు విద్యా పరిశోధనలకు సంబంధించిన కొత్త అంశాలు తెలుస్తాయన్నారు. స్టూడెంట్ క్లబ్స్ శక్తివంతమైన విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించే విధంగా విభాగాధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లు, అధ్యాపకులు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వర రావు, ఎ.విజయదుర్గ, ఎం. బాలకృష, జె.హనుమంతు, బి.లక్ష్మి, సి.హెచ్. శ్రీవర్మ, డా.వెంకట్రావు, ఎన్.రాహుల్ పాల్, బి.యానీ కెజియా, జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



## మాతృ భాష సంగీతం

బాలు....
ఒక స్వర మధురం
ఒక కళా విశ్వరూపం
ఒక స్వర విజయం – అనితర సాధ్యం
వినయ సౌశీల్యం – పరిపూర్ణ వ్యక్తిత్వం


బాలు....
స్వరాల సారథి – సంస్కార వారధి
బాలు....
తరతరాల మధుర జ్ఞాపకం!
నన్నయ విశ్వవిద్యాలయానికి
గీతాన్ని ఆలపించి ఇచ్చిన బాలూ...
"గానమె నీదని – ప్రాణమే గానమని..."
ప్రణతులనర్పిస్తూ.....

- నన్నయవాణి



నవయుగ కవిచక్రవర్తి
శ్రీ గుఱ్ఱం జాషువా జయంతి
సెప్టెంబర్ 28

"కులమతాలు గీసుకున్న గీతలజొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వ నరుడనేను"



మహాకవి
శ్రీ గురజాడ అప్పారావు జయంతి
సెప్టెంబర్ 21

"దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయి
పూని యేదైనాను వొక మేల్
కూర్చి జనులకు చూపవోయి!

స్వంతలాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడు పడవోయి
దేశమంటే మట్టి కాదోయి
దేశమంటే మనుషులోయి!

# యువత సమాజానికి సేవలందించాలి

◆ ప్రిరిపబ్లిక్ డే పెరేడ్ క్యాంప్ సెలక్షన్స్‌కు విశేష స్పందన

◆ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**24.09.21 (మీడియాసెల్)** యువత సమాజానికి సేవలందించాలని, జాతీయ సేవా పథకంలోని విద్యార్థులకు అపారమైన దేశభక్తి మరియు దేశానికి సేవలందించాలనే దృక్పథం ఉండాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంప్ సెలక్షన్స్ 2021-22 ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. యూనిట్లకు అభినందనలు తెలిపారు. ప్రపంచ దేశాలలోనే శక్తివంతమైన యువ జనాభా భారతదేశంలో ఉందని ఆ శక్తిని దేశాభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతీ ఒక్కరు దేశానికి ఏం చేశామని ఎవరికి వారు వ్యక్తిగతంగా ప్రశ్నించుకోవాలన్నారు. ఎన్.ఎస్.ఎస్. లో ఉన్నవారంతా దేశభక్తిని కలిగి దేశానికి సేవ చేయాలనే దృక్పథంతో పని చేయాలని చెప్పారు. యువత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని, ప్రయత్నంలో లోపం ఉండకూడదని సూచించారు. తరువాత యూత్ ఆఫీసర్, రీజినల్ డైరెక్టరెట్ ఎన్.ఎస్.ఎస్. హైదరాబాద్ ఆర్.సైదా మరియు యూత్ అసిస్టెంట్ ఆఫీసర్,రీజినల్ డైరెక్టరెట్ ఎన్.ఎస్.ఎస్. హైదరాబాద్ కె.సి.రెడ్డి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్ జోన్ ఆధ్వర్యంలో సెలక్షన్స్ ప్రక్రియను నిర్వహించామని అన్నారు. 2 సంవత్సరాలు ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్ గా ఉండి 1 స్పెషల్ క్యాంప్ లో పాల్గొని, బరువు, ఎత్తు ఉన్న విద్యార్థులను ఆయా కళాశాలల నుండి ఎంపిక చేశామని చెప్పారు.రన్నింగ్, మార్చ్.పస్ట్,ఎక్స్ట్రా కర్క్యులర్ యాక్టివిటీస్ లో ప్రతిభ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని అన్నారు. వీరిని ప్రీ ఆర్.డి. సెలక్షన్స్ కు పంపుతామని అక్కడ శిక్షణ పొంది ఎంపికైన వారిని రిపబ్లిక్ డే పెరేడ్ కు పంపుతామని చెప్పారు. తరువాత ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల 290 ఎన్.ఎస్.ఎస్. యూనిట్ల నుండి 150 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరయ్యారని అన్నారు. వీసీ జగన్నాథరావు ప్రోత్సహంతో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్లడ్ డోనర్ హబ్ కు మంచి ఆదరణ వచ్చిందని తెలియజేశారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో అతిథులను సన్మానించారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల అయిన ఆదిత్య డిగ్రీ కళాశాల కాకినాడ నుండి 2021 పెరేడ్ లో పాల్గొన్న రెడ్డి దినేష్ మణిసాయిని వీసీ అభినందించారు. సెలక్షన్స్ కమిటీ విద్యార్థులకు రన్నింగ్, మార్చ్.పస్ట్, ఎక్స్ట్ర కర్క్యులర్ యాక్టివిటీస్ లో ప్రతిభ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే పెరేడ్ గొప్ప అవకాశం



దేశ రాజధానిలో జాతీయ పతాకం ఎదురుగా నిలబడి రిపబ్లిక్ డే పెరేడ్ లో పాల్గొనడం గొప్ప అవకాశం.నేను 2021 రిపబ్లిక్ డే పెరేడ్ కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. విభాగం నుండి ఎంపికయ్యాను. రిపబ్లిక్ డే పెరేడ్ శిక్షణ చాలా బాగుంటుంది.మన అలవాట్లు, ఆలోచనలు పూర్తిగా సమాజహితం గా ఉంటాయి. రిపబ్లిక్ డే పెరేడ్ ఎంపిక కావడానికి నాకు అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ అధికారులకు, మా కళాశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు.

**రెడ్డి దినేష్ మణిసాయి, ఆదిత్య డిగ్రీ కళాశాల, కాకినాడ**

## వీసీ గారి ప్రసంగం స్ఫూర్తిదాయకం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని తొలిసారిగా విజిట్ చేశాను.ఎన్.ఎస్.ఎస్. ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ సెలక్షన్స్ లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది.రన్నింగ్, డ్రిల్, ప్రత్యేక ఇంటర్వ్యూలలో నా ప్రతిభను కనపరచాను.నాకు వచ్చిన హిందీ, తెలుగు, ఇంగ్లీష్,రాజస్థానీ, గుజరాతీ భాషలలో సమాధానాలిచ్చి, రాజస్థానీ నృత్య ప్రదర్శన ఇచ్చాను. ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ కు ఎంపికైనా, కాకపోయినా పర్వాలేదు. వీసీ గారు చెప్పినట్లు ప్రతిఫలాన్ని ఆశించకుండా నా ప్రయత్నం నేను చేశాను. అదే ఆనందంగా ఉంది .దేశభక్తితో సమాజానికి సేవ చేయాలన్న వీసీ గారి సందేశం ఎంతో ప్రోత్సాహానిచ్చింది.

**రాజ్ పురోహిత్ ప్రేరణ, SKSD మహిళా కళాశాల,తణుకు.**




రిబ్లిక్ డే పెరేడ్ క్యాంప్ సెలక్షన్స్ దృశ్యాలు





# విద్యార్థులకు సైకలాజికల్ కౌన్సిలింగ్ సేవలు అవసరం

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**21.09.21 (మీడియాసెల్)** ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులకు సైకలాజికల్ కౌన్సిలింగ్ సేవలు అవసరమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. "ఉన్నత విద్యలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లు వాటిని అధిగమించడానికి కావలిసిన మానసిక, సాంఘిక దృక్పథం" అనే అంశంపై నన్నయ విశ్వవిద్యాలయం సైకాలజీ డిపార్ట్మెంట్ మరియు స్పృహ సైకాలజీ పూర్వవిద్యార్థుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ వెబినార్‌ను నిర్వహించారు. సైకాలజీ విభాగ కోర్స్ కోఆర్డినేటర్ డా.పడాల రాజశేఖర్, స్పృహ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిశోర్ లు ఈ వెబినార్‌కు కన్వీనర్స్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విజ్ఞానాన్ని వికసింపచేయడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వెబినార్లను నిర్వహిస్తూ నేటికి 100 వెబినార్లను పూర్తి చేసుకుందన్నారు. సైకాలజిస్టు విద్యార్థులు సోషల్ మీడియాకు, అసాంఘిక వెబ్ సైట్స్ కు బానిసలు కాకుండా, వారిలో ఇమిడి ఉన్న శక్తిసామర్థ్యాలను సద్వినియోగపరచుకోవాలని, సామాజిక బాధ్యత, స్వీయ నియంత్రణతో ఉజ్వల భవిష్యతుకు శ్రమించాలని సూచించారు. యువతలో నెలకొన్న అసాంఘిక ప్రవృత్తిని నియంత్రించి, సన్మార్గంలో పెట్టాలిసిన బాధ్యత పేరెంట్స్, టీచర్స్ తో పాటు సైకాలజిస్ట్ లు పై ఉందని, అందుకు వ్యూహాత్మకంగా, నిర్థిష్ట ప్రమాణలతో అందరూ ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైకాలజి విభాగం మరియు, స్పృహ సైకాలజి అలుమ్ని అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫుల్ టైమ్ కౌన్సిలింగ్ సెంటర్ ను త్వరలో ప్రారంభిస్తామని తెలియజేశారు. కీలకోపన్యాసకులుగా ప్రముఖ విద్యా వేత్త, సైకియట్రిస్ట్ డా.కర్రి రామారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అదిగమించడానికి కావలిసిన మానసిక శక్తి సామర్థాలు, సూత్రాలను వివరించారు. ఒత్తిళ్ళకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవన విధానంలో విద్యను పూర్తి చేయాలని సూచించారు. "సరిలేరుమీకెవ్వరు' అంటూ విద్యార్థులలో ఉన్న శక్తి, సామర్థ్యాలను వెలికి తీసుకోనే మార్గాలను క్రీడాపరిశోధకులు, స్పృహ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిశోర్ వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ఆర్ట్స్ & కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.టేకి, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డా.ఎం.కమలకుమారి, సైకాలజీ కోర్స్ కో ఆర్డినేటర్ డా.రాజశేఖర్, డా.కృష్ణ భవాని, డా.నారాయణ నక్కిన, స్పృహ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిశోర్, వెబ్మాస్టర్ ఎం. శ్రీనివాసరావు, సైకాలజిస్ట్ లు గాదె కిశోర్, శ్రావణి జ్యోత్స్న, రాజేష్ ఖన్నా, శ్రీనివాస్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# రిమోట్ సెన్సింగ్‌దే భవిష్యత్

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

**25.09.21 (మీడియాసెల్)** మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందని, దానిలో భాగంగానే రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. వీసీ ఆహ్వానం మేరకు గరుడలిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ డా.వి.ఎస్.ఎస్.కిరణ్ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వీసీ మాట్లాడుతూ మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ విద్య, పరిశోధనలలో రాణించేందుకు మార్గాలను అన్వేషించాలన్నారు. మెరుగైన సాంకేతిక విజ్ఞాన సేవలను అందిస్తున్న గరుడలిటిక్స్ కంపెనీతో విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటే విద్యార్థులకు, అధ్యాపకులకు టెక్నాలజీ పరంగా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఇమేజ్ ప్రోసెస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎనలేటిక్స్, జియోస్టాటియల్, సాఫ్ట్ వేర్స్ డెవలప్మెంట్, కన్సల్టెన్సీ, డేటా, డాక్యుమెంటేషన్ వంటి వాటిలో శిక్షణ అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్టిఫికెట్టు కోర్సులు మాదిరిగా విద్యార్థులకు శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చుని తెలిపారు. రిమోట్ సెన్సింగ్, డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ పైలెట్ లైసెన్స్ లు వంటివి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ తాయన్నారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు వివిధ ప్రాజెక్టులకు అప్లై చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, గరుడలిటిక్స్ కంపెనీ వారి సహకారం ఉంటుందన్నారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని వ్యవసాయ, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఎన్నో మార్పులను తీసుకురావచ్చునని చెప్పారు. ప్రకృత్తి విపత్తులు, అత్యవసర పరిస్థితుల నుండి విముక్తి పొందే మార్గాలను సమాజానికి అందించవచ్చుని తెలిపారు. తరువాత గరుడలిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ డా.వి.ఎస్.ఎస్.కిరణ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తాము అందించే సేవలను వివరించారు. తనకు గురువుగా మొక్కా జగన్నాథరావు ఎంతో ప్రోత్సాహాన్ని అందించి ఉన్నత స్థానంలో నిలబడేందుకు మార్గనిర్థేశం చేశారని గుర్తు చేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు.డా.కిరణ్ ను విశ్వవిద్యాలయ అధికారులు సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య వై.శ్రీనివాసరావు, అధికారులు ఆచార్య పి.సురేష్ వర్మ, డా.వి.పెర్సిస్, డా.కె.నూకరత్నం, డా.పి.విజయనిర్మల, డా.కె.వి.స్వామి, డా.పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డా.కిరణ్ ను సన్మానిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు

# 2022కి పోల'వరం'

# పూర్తిచేయడమే లక్ష్యం

## పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ బి.సుధాకర్ బాబు



**పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ గా బి.సుధాకర్ బాబు కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వారు నిర్వహించిన అద్విక 2కె21 కు ఆయన హాజరయ్యారు. (వారితో ఎడిటర్ ముఖాముఖీ)**

**సర్. నమస్సులు ! తమ విద్య, ఉద్యోగ జీవితం...విశేషాలు తెలియజేయండి**

మాది గుంటూరు జిల్లా, 1962 లో జన్మించాను. బి.టెక్ (వాటర్ రిసోర్స్ డిపార్టమెంట్) పూర్తి చేశాను. 1984లో ఏ.పి.ఎస్.ఎస్. నియమకాలలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గా ఉద్యోగాన్ని ప్రారంభించాను. 1997 నుండి 2004 వరకు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గా, 2004 నవంబర్ నుండి 2005 అక్టోబర్ వరకు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గా విధులు నిర్వహించాను. 2005 అక్టోబర్ నుండి 2017 నవంబర్ వరకు సూపరింటెండింగ్ ఇంజనీర్ గా నంద్యాల, కడప, కర్నూలు మరియు అనంతపూర్ లో విధులు నిర్వహిస్తూ ఇన్చార్జ్ చీఫ్ ఇంజనీర్ గా తిరుపతిలో 2016 ఆగష్టు నుండి 2017 వరకు బాధ్యతలు నిర్వహించాను. చీఫ్ ఇంజనీర్ గా 2017 నవంబర్ నుండి 2019 జూలై వరకు ఒంగోలులోను విధులు నిర్వహించాను. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ గా 11.07.2019న బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు విధులలో నిమగ్నమై ఉన్నాను.

**పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విశేషాలు....**

194.6 టిఎంసీల సామర్ధ్యంతో పోలవరం ప్రోజెక్టు నిర్మాణం జరుగుతుంది. ఇందులో ప్రధానంగా మూడు భాగాలున్నాయి. 1. రిజర్వాయర్ 2. స్పిల్‌వే 3. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం **రిజర్వాయర్:** ఇందులో నీటిని నిల్వ చేస్తారు. **స్పిల్‌వే:** రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు స్పిల్‌వే ఉపయోగడుతుంది. ప్రపంచంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో భారీ సామర్ధ్యంతో దిగువకు నీటిని విడుదల చేసే స్పిల్ వే ఇది. మొత్తం 48 గేట్లుతో రెండు కొండల నడుమ దీన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికి 42 గేట్లు పూర్తి అయ్యాయి. **కాలువలు:** రిజర్వాయర్‌కు రెండు కాలువలు ఉంటాయి. ఒకటి కుడి వైపు. రెండోది ఎడమ వైపు. వీటి ద్వారా నీటిని తరలిస్తారు.



ప్రస్తుతం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఏరియల్ వ్యూ

**ఆనకట్ట:** ఇది రిజర్వాయర్ ఆనకట్ట. ఇందులో అనేక భాగాలున్నాయి.
**డయాఫ్రం వాల్..** నది మధ్యలో దాదాపు 300 అడుగుల లోతులో కడుతున్న కాంక్రీటు గోడ. నీరు లీకేజీ కాకుండా ఇది కాపాడుతుంది. దీని పొడవు 2.454 కిలోమీటర్లు.

రాతి, మట్టి కట్టడం.. డయాఫ్రం వాల్‌కు ఇరువైపులా రాతి, మట్టి కట్టడం (ఎర్త్–కం–రాక్ ఫిల్ డ్యాం) నిర్మిస్తారు. **కాఫర్ డ్యాం:** ప్రధాన డ్యాంను నిర్మించేటప్పుడు నీరు అడ్డు తగలకుండా ఉండేందుకు తాత్కాలికంగా నిర్మించే కట్టడాన్ని కాఫర్ డ్యాం అంటారు. పోలవరం విషయంలో రెండు కాఫర్ డ్యామ్‌లు ప్రతిపాదించారు. నది ప్రవాహం అడ్డుతగలకుండా ఎగువన ఒకటి, ధవళేశ్వరం బ్యారేజీ బ్యాక్ వాటర్ అవరోధం కలిగించకుండా దిగువున ఒక డ్యాం నిర్మించాలని నిర్ణయించారు. **విద్యుత్ ఉత్పత్తి కేంద్రం :** ఎర్త్–కం–రాక్ ఫిల్ డ్యాం కు ఆనుకుని విద్యుత్ ఉత్పత్తి కేందాన్ని నిర్మాణం జరుగుతుంది. ఒక్కో యూనిట్ లో 80 మెగావాట్ల చొప్పన 12 యూనిట్లలో 960 మెగావాట్ల సామర్ధ్యంతో విద్యుత్ ను ఉత్పత్తి చేసేలా ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నాం.

**పోలవరం ప్రాజెక్టుతో కలిగే ప్రయోజనాలు ఏమిటండి...**

23 లక్షల ఎకరాలకు కృష్ణ గోదావరి డెల్టా ఆయకట్టు స్థిరీకరణతో పాటు నూతనంగా విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. విశాఖపట్నంలో కర్మాగారాల నీటి అవసరాలను తీర్చనున్నాం. విశాఖపట్నం నగరానికి తాగు నీరు అందిస్తాం. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత తగ్గుతున్నందున బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా పోలవరం ఉపయోగపడుతుంది.

**ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి అవుతుంది.**

ప్రభుత్వ ప్రోత్సాహంతో వరదల్లోను, కోవిడ్ సమయంలోను శరవేగంతో పనులు నిర్వహించాం. ప్రస్తుతం 77 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. జూన్ 2022 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

**యువతకు మీరిచ్చే సందేశం.**

పోలవరం మనకు సమీపంలో నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టు. ఇంజనీరింగ్ రంగంలో ఇప్పటి వరకూ చూడని ఎన్నో విశేషాలు ఈ ప్రాజెక్టులో ఉన్నాయి. గోదావరి జిల్లాల్లోని ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రజలు ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న యువతరం పోలవర నిర్మాణాన్ని వీక్షించి నూతన విజ్ఞానాన్ని తెలుకొని రేపటి చరిత్రకు సాక్షులుగా నిలవాలని కోరుకుంటున్నాను.

**మంచిదండి.** దేశంలోనే ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టు త్వరలోనే జాతికి అంకితం కావాలని, అన్నదాతలకు వరాలను అందించాలని, బీడుభూములు సస్యశ్యామలం కావాలని, నీటి కష్టాల నుండి రాష్ట్రాలు విముక్తమై సుసపన్నంగా అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. తమరు ఇంజనీరింగ్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకొని సమాజానికి సేవలందించాలని కోరుకుంటూ నన్నయవాణి తమకు కృతజ్ఞతల్ని అందిస్తుంది.

**నమస్కారమండి.**
**థ్యాంక్యూ ఎడిటర్ గారు..**
**మళ్ళీ కలుద్దాం.**



స్పిల్ వే 48 గేట్లు నుండి గోదావరి వరద ప్రవాహం



కాఫర్ డ్యామ్



960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం